క్లుప్తంగా

పార్టీబలోపేతానికి కృషి చేయండి



అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి,87వ వార్డునాయకులు

కూర్మన్నపాలెం: పార్టీ బలోపేతానికి అంతా కృషి చేయాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఇల్లపురాము, దానప్పలు, పి.వేణు, గోవింద్, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం నేడు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై సీఐటీయూ ఆధ్వర్యంలో ఏడు ఏళ్లుగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా సెక్టార్–5 అంబేడ్కర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్న శిబిరాన్ని కేజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి. రాధాకృష్ణన్ ప్రారంభిస్తారని యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి తెలిపారు. శిబిరంలో అంతా స్వచ్ఛందంగా పాల్గొవాలని కోరారు.

కొలువులు సాధించిన విద్యార్థులకు అభినందన



టీసీఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో మహిళా కళాశాల అధ్యాపకులు

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఐదుగురు ఎంబీఏ విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్‌కు ఎంపికయ్యారు. కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు రూ.6.5 లక్షల ప్యాకేజీతో ఎంపికకావడంపై కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఎంపికైన విద్యార్థులు లతాశ్రీ, నిహారిక, చంద్రిక లహరి, సాయిలలిత అనూహ్య, రుషితలను అభినందించారు కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి రామకృష్ణ, డీన్ మహేంద్ర సాయి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మృతికి సంతాపం

గాజువాక: సాక్షి దినపత్రిక అక్కిరెడ్డిపాలెం విలేకరి బి.రామకృష్ణ హఠాన్మరణంపై బీహెచ్ఈఎల్ సీఐటీయూ నాయకులు సంతాపం ప్రకటించారు. రామకృష్ణ చైతన్యపూరిత విలేకరిగా తన సేవలు అందించారని ఆ యూనియన్ నాయకులు జి.టి.పి.ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, కె.నారపరెడ్డి, ఆర్.జనార్దనరావు, పి.కనకారావు, కె.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. భెల్ కార్మిక సమస్యలు, స్థానిక సమస్యలపై పూర్తి అవగాహనతో ప్రతిక ద్వారా ప్రజలకు తెలియజేయడంలో మంచిపాత్ర పోషించారన్నారు.

పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం పదిలం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు


కూర్మన్నపాలెం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. స్థానిక బొట్టవానిపాలెంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని.. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు!

పూడుకుపోయిన గెడ్డలు
తొలగించకపోతే ముంపు ముప్పు



గాజువాక: జీవీఎంసీ 68, 69వ వార్డుల పరిధిలోని పలు గెడ్డలు అధ్వానంగా తయారయ్యాయి. జీవీఎంసీ సిబ్బంది కూడా తూతూ మంత్రంగానే పూడిక తీత పనులు చేయడంతో ఎక్కడికెక్కడ అక్కడే దర్శనమిస్తోంది. దీంతో చిన్నపాటి వర్షాలు కురిసినా కాలువలు పొంగి మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది.

కొన్ని ప్రధాన గెడ్డల పరిస్థితి ఇదీ..

మిందిలోని కొన్ని కాలువలు దుర్భరంగా మారాయి. గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో బ్రిడ్జి పక్కన గెడ్డ పూర్తిగా మురుగు, బురదతో పూడుకుపోయింది. దీన్ని పుట్టించుకునే నాథుడే లేడని గ్రామస్తులు అంటున్నారు. ఈ గెడ్డ నుంచి విడుదలయ్యే మురుగునీరు పోర్టు రోడ్డు నుంచి కొనసాగే నాలాల నుంచి సముద్రంలో కలిసేది. కానీ ఇప్పుడు పోర్టు 6 లైన్ల రోడ్డు నిర్మాణంతో చాలా నాలాలను మూసేస్తున్నారు. వర్షాలు, వరదల సమయంలో భారీ విపత్తు ఎదుర్కొవాల్సి వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

సబ్ స్టేషన్ వద్ద గెడ్డ దుస్థితి

ఆటోనగర్ నుంచి వస్తున్న గెడ్డ మింది విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు వచ్చే సరికి భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇటు పూడికలు తీస్తున్నా .. గెడ్డలో నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు కొట్టుకువచ్చి సబ్‌స్టేషన్ వద్ద డంప్ అవుతున్నాయి. పొరపాటున ఇవి సబ్‌స్టేషన్ వద్ద గల కల్వర్టు కిందకు వెళ్లి కూరుకుపోతే తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉంది.

ఏ – బ్లాక్‌లో..

ఒక వైపు చేపలు, మాంసం వ్యాపారాలు ఎదురుగానే మురుగు గెడ్డ ఉండడంతో ఇటు కొనుగోలు దారులు, అమ్మకం దారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక వర్షాకాలం వస్తే పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు ఈ ప్రాంతం అంతా బురదమయంగా తయారవుతుంది. సమస్య పరిష్కరించాలని వ్యాపారులు ఎన్ని మార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు.

గెడ్డలు మూసివేస్తే ఇబ్బందులు



పోర్టు నిర్మిస్తున్న ఆరులేన్ల రోడ్డులో భాగంగా గెడ్డల్లో మురుగు పోయే పరిస్థితి లేకుండా పోతుంది. కొన్నిచోట్ల నాళాలు మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే మింది శ్మశానవాటిక వద్ద గల గెడ్డ మురుగు, బురదతో నిండి పోయింది. వర్షాకాలం వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాలి. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– ఈటి సురేష్, గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి, మింది

గెడ్డల పరిస్థితి దారుణం



నిర్వహణ లేక గెడ్డలు పూడుకలతో నిండిపోయి దారుణంగా ఉన్నాయి. గ్రామాల్లోని కాలువలు పలు చోట్ల దుర్భరంగా ఉన్నాయి. వీటి పరిస్థితి వర్షాలు పడితేగానీ బయటపడవు. వర్షం పడినప్పుడు కాలువల్లో నుంచి చెత్తా చెదారం రోడ్డుమీదకు వచ్చి చేరుతుంది. తక్షణమే స్పందించి ముంపు ముప్పు లేకుండా పూడికలు తొలగించాలి.

– గోపిశెట్టి సన్యాసిరావు, గ్రామ నాయకుడు, నాతయ్యపాలెం

సంపూర్ణ ఆరోగ్యానికి సంజీవని యోగ



యోగాభ్యాసం చేస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సంజీవని లాంటిదని పినమడక హైస్కూల్ హెచ్ఎం పి.బ్రహ్మానందం అన్నారు. బ్రహ్మకుమారీస్ అగనంపూడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ ఇంట్లో యోగాసాధన నిత్యం జరగాలన్నారు. చిన్న వయసు నుంచి యోగ, ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతతతోపాటు శారీరక రుగ్మతలు దూరం అవుతాయని చెప్పారు. బ్రహ్మకుమారీస్ అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి మాట్లాడుతూ పది రోజులుగా విద్యార్థులతోపాటు వివిధ సంస్థల్లో ఉచిత యోగా శిక్షణా తరగుతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పెద్ద ఎత్తున ధ్యానులను పాల్గొనేలా చేయనున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యాయులు కొండబాబు, నాయుడుబాబు, ప్రసాద్, శేషగిరి రమేష్, శ్రీదేవి, శ్యామల సత్యవతి పాల్గొన్నారు.

ఆధార్ అవస్థలు

సచివాలయాల్లో సర్వర్ పనిచేయక తిప్పలు



దల్లివానిపాలెం సచివాలయం వద్ద రద్దీ

పెదగంట్యాడ: ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే పలుమార్లు గడువు పెంచుతూ వస్తోంది. ఈ నెల 14వ తేదీ తుది గడువు కావడంతో ఆధార్ అప్‌డేట్ తో పాటు సవరణలు,తదితర అవసరాల కోసం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు ఆశ్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొన్ని సచివాలయాల్లోనే సేవలు అందుబాటులో ఉంచడంతో ఆ కేంద్రాల వద్ద నిత్యం రద్దీ ఏర్పడుతుతోంది. మరో వైపు తరచూ సర్వర్ సమస్యలతో వ్యయప్రయాసలు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.

గతంలో నిత్య సేవలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆధార్ కేంద్రాలతో పాటు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించేవారు. ప్రస్తుతం సచివాలయాల్లో పౌర సేవలు సక్రమంగా అందడం లేదు. వివిధ సర్వేలు, ఇతర పనులకు సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవడంతో ఇదే అదునుగా సచివాలయ సిబ్బంది కొందరు స్వంత పనులపై మక్కు చూపుతూ సచివాలయాల్లో అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకుంది.

యథేచ్ఛగా గుట్కా విక్రయాలు

- వ్యసనాలకు బానిసవుతున్న యువత
- పట్టించుకోని యంత్రాంగం



విక్రయానికి సిద్ధంగా నిషేధిత గుట్కా, ఖైనీ ప్యాకెట్లు



దుకాణాల్లో విక్రయిస్తున్న ఖైనీ ప్యాకెట్లు

పెదగంట్యాడ: రోజురోజుకూ అనేక మంది యవకులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు.ముఖ్యంగా పదో తరగతి విదార్థుల నుంచి ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడుతున్నారు. గుట్కా, ఖైనీ వంటి హానికర మత్తు పదార్థాలను కాలక్షేపానికి కొందరు, వినోదానికి మరికొందరూ అలవాటు చేసుకుంటున్నారు. గుట్కాలో టుబాకో, లైమ్, సింథటిక్ తదితర విషపూరిత రసాయనాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఖైనీ తినడం వల్ల పెదవులు పొక్కిపోయి కొంత కాలానికి దంతాలు, చిగుళ్ల పాడవుతాయని హెచ్చరిస్తున్నారు. మండలంలో చిన్న దుకాణం నుంచి పెద్ద దుకాణం వరకూ నిషేధిత గుట్కా, ఖైనీ అందుబాటులో ఉండడం వల్ల చిన్న వయసు వారు కూడా వీటికి ఆకర్షితులవుతున్నారు. వీటి అమ్మకాల పై నిషేధం ఉన్నా మార్కెట్‌లో విచ్చలవిడిగా లభిస్తున్నాయి. గాజువాక నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో హోల్‌సేల్ దుకాణాలు యజమానులు వీటిని గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. అలాగే పెదగంట్యాడ, గాజువాక ఆటోనగర్ పరిశ్రమల మధ్య వీటిని తయారు చేస్తూ కంపెనీ వివరాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని సమాచారం. మత్తు పదార్థాలను నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు లంచాల మత్తులో పడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతోవ్యాపారులు వీటి ధరలు పెంచేసి విచ్చలవిడిగా దోచుకుంటున్నారు.

ఉక్కు అమరవీరులకు ఘన నివాళి



సీ భవన్‌లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న డైరెక్టర్ సలీం, నాయకులు



89వ సారి రక్తదానం చేస్తున్న అనిల్‌కుమార్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న డైరెక్టర్ బాగ్చీ



మొక్కలు నాటుతున్న హెచ్‌ఆర్ జీఎం భాను, విప్స్ కార్యదర్శి శేషమ్మ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోసం ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులకు ఉక్కు అధికారుల సంఘం (సీ), వివిధ కార్మిక సంఘాల నాయకులు నివాళులర్పించారు. 2012లో స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–2లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 19 మంది ఉద్యోగులకు సీ భవన్‌లో సంస్మరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ, డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి పురుషోత్తం, ప్లాంట్ హెచ్‌ఆర్ ఇన్‌చార్జి ఎస్. భాను, భద్రతా విభాగాధిపతి ఫణికుమార్, ఉక్కు వైద్యులు డాక్టర్ రాజశేఖర్, ఫైనాన్స్ విభాగాధిపతి హెచ్.కె. ఝా, విప్స్ కార్యదర్శి డాక్టర్ శేషమ్మ తదితరలు హాజరై మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్, జేసీస్, హోమీబాబా మెమోరియల్ క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 75 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. ఉక్కు మాజీ ఉద్యోగి డి.వి. అనిల్‌కుమార్ 89వ సారి రక్తదానం చేసి పలువురికి స్ఫూర్తినిచ్చారు. కార్యక్రమంలో భాగంగా సీ భవన్ ఆవరణలో మొక్కలు నాటారు. సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షులు టి. శ్రీనివాసరావు , నరసింహ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...

స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎల్‌డీసీ వద్ద నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ నాటి ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు, కె. రాజబాబు, మోహన్‌బాబు, తాండ్ర కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజీఆర్‌ఎఫ్‌కు మూడు ఫిర్యాదులు



సదస్సుకు హాజరైన ఈపీడీసీఎల్ అధికారులు, వినియోగదారులు



సదస్సులో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ సత్యనారాయణ

పెదగంట్యాడ: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ పెదగంట్యాడలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు మూడు ఫిర్యాదులు అందాయి. పెదగంట్యాడ రూరల్ మండలంలోని దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి లోవోల్టేజీ సమస్య వేధిస్తోందని వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. అలాగే బీసీ రోడ్డుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉందని వెంటనే తొలగించాలని కోరారు. అలాగే కొంగపాలేనికి చెందిన ఓ వ్యక్తి కరెంటు బిల్లులు అత్యధికంగా వస్తున్నాయని విన్నవించారు. ఫిర్యాదులు అందుకున్న సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బి.సురేఖారాణి, ఎస్.సుబ్బారావు, ఎం.మురళీకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు, డీఈఈ మాధవి, ఏఈలు రాజేంద్రప్రసాద్, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

మొండి వైఖరి విడనాడాల్సిందే..

- లేకుంటే సమ్మెకు దిగుతాం
- ఆర్టీసీ కార్మికుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ ప్రధాన కార్యదర్శి శంకరరావు

మల్కాపురం: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం తన మొండి వైఖరిని విడనాడాలని,లేని పక్షంలో ఈ నెల 25వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని గాజువాక ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి పి.శంకరరావు హెచ్చరించారు. యాజమాన్యం తీరు వల్ల కార్మికులు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం ఆర్టీసీ డిపో సమీపంలో నిర్వహించిన సమావేశంలో చర్చించారు. కార్మికులకు చట్ట వ్యతిరేక డ్యూటీలు రద్దు చేయాలని, అన్యాయంగా సస్పెండ్ చేసిన కార్మికుల సస్పెన్షన్ ఎత్తి వేయాలని,మహిళా ఉద్యోగులకు సరిపడే రెస్ట్‌రూమ్‌లు, లేటు అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్ల దాటిన మహిళలకు ఓటీ డ్యూటీలకు బలవంతంగా పంపిచాలనే యాజమాన్యం చేస్తున్న యత్నం మంచిది కాదన్నారు. యాజమాన్యం కార్మికుల పట్ల అనుసరిస్తున్న వైఖరి మార్చుకోవాలని కోరారు.

విశ్వబ్రాహ్మణులపై పాలకుల చిన్నచూపు



విశ్వబ్రాహ్మణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కూర్మన్నపాలెం: విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆంధ్ర రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హనుమంతురావు ఆరోపించారు. ఆ సంఘ కార్యవర్గ సమావేశం శుక్రవారం కూర్మన్నపాలెంలో నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ సామాజిక వర్గాన్ని పట్టించుకోవడం లేదని సభ్యులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులు ఎంత మంది ఉన్నారన్న విషయం ప్రభుత్వాలకు తెలియాలంటే కులగణన చేయాలని తీర్మానం చేశారు. అలాగే సెప్టెంబర్ 17న అమరావతిలో యజ్ఞం నిర్వహించాలని నిర్ణయించారు. విశ్వబ్రాహ్మణులకు ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు పాపయ్య, నరసింహాచారి, శ్రీనివాసరావు, కాకుమూరు వెంకటవేణు, అన్ని జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ ఐడియాలజీ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ తదితరులు

విశాఖ సిటీ: మోడ్రనైజింగ్ డాక్టర్ అంబేడ్కర్ ఐడియాలజీ పుస్తకాన్ని డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మెంబర్ సెక్రటరీ ప్రభాత్ కుమార్ సింగ్ సమక్షంలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ ఆవిష్కరించారు. నేటితరం యువతను అంబేడ్కర్ ఆలోచనలతో అనుసంధానం చేసే విధానాన్ని పుస్తకంలో వివరించినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ల ప్రగతిని సమీక్షించడానికి శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ 2024–25లో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధితో పాటు 2025– 26 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికను ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ సభ్యులకు వివరించారు. ఏయూలో ఏర్పాటైన అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైవిధ్యమైన కార్యక్రమాలు, ప్రజలకు, యువతకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైవిధ్యమైన పరిశోధనలతో పాటు విభిన్న వర్గాలకు చేరువయ్యేలా అంబేడ్కర్ చైర్ నిర్వహించిన కార్యక్రమాలను అమిత్ యాదవ్ ప్రశంసించారు. యువతలో అంబేడ్కర్ ఆలోచనలను తీసుకెళ్లి వారిని ప్రభావితం చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏయూ అంబేడ్కర్ చైర్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమీక్షకు ఏయూ తరఫున ఆర్–డీ విభాగం డీన్ ఆచార్య వి.వల్లి కుమారి ప్రాతినిధ్యం వహించారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో బహుళ ప్రయోజనాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

గాజువాక: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకోవడం ద్వారా పలు ప్రయోజనాలను పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏడీఈ పార్థసారథి అన్నారు. స్థానిక చైతన్యనగర్‌లో శుక్రవారం నిర్వహించిన సోలార్ రూఫ్‌టాప్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోదలచిన వినియోగదారులకు ప్రభుత్వం నేరుగా రూ.78 వేలు సబ్సిడీ అందిస్తోందన్నారు. సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోవడం వల్ల వినియోగదారుల విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకుంటే విద్యుత్ బిల్లు పూర్తిగా ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, చినగంట్యాడ సబ్ స్టేషన్ ఏఈ రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అదుపుతప్పి.. ప్రహరీని ఢీకొట్టిన ట్రాక్టర్



ప్రహరీలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

పెదగంట్యాడ: ఓ ట్రాక్టర్ అదుపుతప్పింది.. ఓ ఇంటి ప్రహరీలోకి దూసుకెళ్లింది.. దీంతో ప్రహరీ దెబ్బతినడంతో పాటు కరెంట్ స్తంభం వాలిపోయింది. జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. పెదగంట్యాడకు చెందిన రాజు అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే భవన నిర్మాణ శిథిలాల లోడుతో బయల్దేరాడు. హౌసింగ్ బోర్డు కాలనీ వద్దకు వచ్చే సరికి స్టీల్‌ప్లాంట్ డిస్పెన్సరీ వద్ద ఒక్కసారిగా అదుపు తప్పింది. ఓ ఇంటి ప్రహరీలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఇంటి ప్రహరీ దెబ్బతినడంతో పాటు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి పోయింది. ఈ సంఘటనపై న్యూపోర్టు పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

గాజువాక: షీలానగర్ జాతీయ రహదారిపై ఓ కారులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కారు ఇంజిన్‌లో నుంచి పొగ వచ్చి ఒక్కసారిగా దట్టమైన మంటలు వ్యాపించాయి. కారులో ప్రయాణిస్తున్న తండ్రి, కుమార్తె ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు అందించిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా ఉమ్మలాడకు చెందిన ఎల్.ఎస్.వి.ప్రభాకర్ శనివారం తిరుపతి దర్శనం కోసం బయల్దేరాల్సి ఉంది. ఎన్ఏడీ కొత్తరోడ్‌లోని తమ బంధువుల ఇంట్లో ఉన్న కుమార్తెను తీసుకొని వెళ్లడం కోసం వచ్చిన ఆయన కుమార్తెతో కలిసి కారులో ఉమ్మలాడకు బయల్దేరారు. షీలానగర్ జంక్షన్‌కు వచ్చేసరికి కారు ఇంజిన్‌లోనుంచి పొగ రావడం గమనించారు. అప్రమత్తమైన ఆయన తనతోపాటు కుమార్తెను కారులోనుంచి దించేశారు. క్షణాల్లోనే దట్టమైన మంటలు వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఆటోనగర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పివేశారు.